# 4. వొచ్చినవేంది? పోతున్నవేంది?

**నేపథ్యం:**

ఒకసారి ఒక వ్యక్తి వాసన 'సుయ్' 'సుయ్' శబ్దాల ఆధారంగా 'గారెలు' లెక్క ఖచ్చితంగా చెబుతాడు. ఇంకోసారి ఎవరిదో గాడిద కనబడకుండా పోతే రాత్రంతా వెదికి పట్టుకొని గప్‌చుప్‌గా తెచ్చి కట్టేస్తాడు. దానితో గొప్ప జ్యోతిష్యునిగా పేరుపొందుతాడు. ఇది విన్న రాజుగారు అతనిని పిలిపించి 'గబుక్కున గుప్పెట్లో దేనినో పట్టుకుని 'ఇదేంటో చెప్పు' అంటారు. ఆవ్యక్తి భయంతో వణికిపోతూ తలవని తలంపుగా సయ్యం సుయ్యం గారెలదృష్టం, శరీరకష్టం గాడిదదృష్టం, చస్తిని గదరా మిడతం భట్టు' అంటాడు. దానికి రాజుగారు శభాష్! నా పిడికిలిలోనిది మిడత అని భలే కనిపెట్టావ్! అంటారు. మరి ప్రస్తుత పాఠంలో అలాంటిదే ఒక సంఘటన జరిగింది. అదేంటో చదవండి మరి!



ఒక వూల్లె ఒక పశువుల కాపరి వుండేటోడు. రోజు పొద్దుగాల్నే పశువుల్ని తోల్కొని పోవుడు, పొద్దుగూకంగ యెన్కకు మల్లుకొచ్చుడు, యింత దిని పండుకునుడు. యియ్యే ఆయిన రోజు జేశే పనులు. యింతకు మించి ఆయినకేం దెల్వదు.

ఒగనాడు ఆయిన బార్య ఆయినతోటి "యేవయ్యా! వూల్లె అందరు నన్ను వట్కోని నీ మొగడు ఒట్టి అమాయికుడు. నోట్లె యేలు వెడ్తె కొర్కడు. యీ రోజులల్ల గిట్లుంటె యెట్ల! నలుగుట్ల దిరుగాలె నాలుగు ముచ్చట్లు దెల్సుకోవాలె అంటుర్రు. ఆల్లు అట్ల అంటుంటె నాకు శాన శిన్నతనం అన్పిస్తుంది. యిగనుంచి నేను పశువుల గాస్కొంటగని నువ్వు వూల్లె పెద్ద మనుసుల సుట్టు దిరిగి జెరన్ని పెద్దరికపు మాటలు నేర్చుకొనిరాపో!" అన్నది.

పశువుల కాపరి సరేనని కచ్చీరు కాడికి వొయ్యిండు. ఆడ కొంతమంది పెద్ద మనుసులు గూసోని వొచ్చి పొయ్యేటోల్లతోటి అదో ముచ్చట, యిదో ముచ్చట మాట్లాడుతుర్రు ఆయిన అయన్ని యిన్కుంట గూసుండు. వొచ్చినవేంది? కూసున్నవేంది? నిలవడ్డవేంది? పోతున్నవేంది? వుర్కుతున్నవేంది? గిసొంటి మాటలన్ని యిన్నడు. పెద్దరికపు మాటలంటె గయ్యే అన్కోని యింటికి వొయిండు.

యింట్ల అడుగు వెట్టంగనే బార్య యెదురుంగొచ్చి "యేవైంది, యేవన్న నేర్చుకున్నవా?" అనడిగింది. దానికాయిన "ఓ మస్తు నేర్చుకున్న!" అని ఆ మాటలన్ని యినిపిచ్చిండు. అప్పుడామె తల్కాయ గొట్కుంట "నీ తెల్వి తెల్లారినట్టే వుంది. పెద్దరికపు మాటలంటె గియ్యా? నలుగురికి జెప్పెటట్టు వుండాలె, పదుగురు మెచ్చెటట్టు వుండాలె! యెన్నడు నేర్చుకుంటవొ యేమోపో!" అన్నది.

యిగ పశువుల కాపరి అయ్యే మాటల గురించి ఆలోశించుకుంట పండుకుండు. మద్యరాత్రి గాంగనే ఒక దొంగోడు ఆల్లింట్లకు జొరవడ్డడు. అదే టైముకు మనోడు నిద్రల కలువరిచ్చుడు మొదల్వెట్టిండు. "వొచ్చినవేంది? అన్నడు. అది యినంగనే దొంగ "నేను వొచ్చిన సంగతి యీడు గనిపెట్టిండా యేంది?" అన్కుంట ఒక మూలకు వొయ్యి గూసుండు. అప్పుడు పశువుల కాపరి "కూసున్నవేంది?" అని కలువరిచ్చిండు. దొంగ ఒల్లు జల్లుమన్నది. నిమ్మలంగా లేశి నిలవడ్డడు. అప్పుడే పశువుల కాపరి "నిలవడ్డవేంది?"




అన్నడు. దొంగోని గుండె గుబిల్లుమన్నది. అడుగుల అడుగేసుకుంట యెన్కకు మల్లిండు. అప్పుడు "పోతున్నవేంది?" అని కలువరిచ్చిండు పశువుల కాపరి. యిగ దాంతోని దొంగకు అదురువుట్టింది. వురుకుకుంట వొచ్చిన తొవ్వ వట్టిండు. ఆడు అట్ల వోతుంటె "వుర్కుతున్నవేంది?" అన్నడు కాపరి. దాంతోని దొంగ యింకింత అదురుకోని "వామ్మో! యీడు కండ్లు మూస్కోనేఅన్ని గనిపెడ్తుండురో! యిగ నా పని జేస్తట్టే వుండు!" అన్కుంట యెన్కకు వల్లి సూడకుంట వుర్కుడే వుర్కుడు!

## I. వినండి-సంభాషించండి.

1. పెద్ద మనుషుల లక్షణాలను చెప్పండి.
2. అమాయకులని ఎవరిని అంటారు?
3. కచ్చేరు లెక్కడుంటాయి? అక్కడ చేసే పనులేమిటో చర్చించండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం.

మల్పుకొచ్చుట = తెచ్చుకోవడం; నలుగుట్ల = నలుగురిలో; ముచ్చట్లు = సంగతులు, కబుర్లు;
వుర్కుతున్న = పరుగెత్తుతున్న; గిసొంటి = ఇటువంటి; మస్తు = చాలా; నిమ్మలంగా = నెమ్మదిగ; తొవ్వ = తోవ, దారి.

## III. వినండి-చర్చించండి-రాయండి.

### అ జవాబు రాయండి.

1. పశువుల కాపరి స్వభావం.
2. దొంగోడు ఉరుక్కుంటు పోవడానికి కారణం.
3. పెద్దరికపు మాటలు ఈ విధంగా ఉండాలి.
4. పశువుల కాపరి నేర్చుకున్న పెద్దరికపు మాటలు.

### ఆ. ఖాళీలు పూరించండి.

1. పొద్దుగూకంగా ____________ మల్పుకొచ్చుడు.
2. నలుగుట్ల దిరుగాలె ____________ తెల్సుకోవాలె.
3. మధ్యరాత్రి గాంగనే ఒక ____________ ఆల్లింట్లకు జొరవడ్డడు.
4. యీడు ____________ మూస్కోనే అన్ని గనిపెడ్తుండురో.

### ఇ. ఎవరు ఎవరితో అనిరి.

1. మస్తు నేర్సుకున్న. [ ____ ] → [ ____ ]
2. నీ తెల్వి తెల్లారినట్టె ఉంది. [ ____ ] → [ ____ ]

## IV. భాషావగాహన

### అ. కాలాలు గుర్తించి రాయండి.

1. ఒక పశువుల కాపరి వుండెటోడు. [ ]
2. జెరన్ని పెద్దరికపు మాటలు నేర్చుకుని రాపో. [ ]
3. ఆడ కొంతమంది పెద్ద మనుషులు గూసోని వున్నారు. [ ]

### ఆ. వచనములు మార్చి రాయండి.

1. పశువులు = [ ]   2. పని = [ ]
3. ముచ్చట = [ ]   4. కండ్లు = [ ]

### ఇ. సంధి చేసి రాయండి.

1. ఆయనకు + ఏం = [ ]   2. యెదురుంగా + ఒచ్చి = [ ]
3. మాటలు + అంటె = [ ]   4. అప్పుడు + ఆమె = [ ]

## V. లేఖన నైపుణ్యాలు: (అధికార లేఖ)

మీ పాఠశాలకు సమీపంలోనున్న బీడి, సిగరెట్ల దుకాణాన్ని తొలగించవలసినదిగా అభ్యర్థిస్తూ పోలీస్ ఇన్స్పెక్టర్, పోలీస్ స్టేషన్, వడాల, ముంబయి వారికి, కింది అంశాల ఆధారంగా లేఖ రాయండి.

**అంశాలు :-**

- నీ చిరునామా, తేది,
- అధికారి చిరునామా
- సంబోధన
- విషయ వివరణ
- ముగింపు
- ధన్యవాదాలు

**పురుషలు:**

1. ఉత్తమ పురుష : తమను గురించి తెలుపునది.
   ఉదా : నేను, మేము.
   నేను పుస్తకము చదువుచున్నాను.
   మేము ఆడుకొనుచున్నాము.
2. మధ్యమ పురుష: ఎదుటి వారిని గురించి తెలుపునది.
   ఉదా : నీవు, మీరు.
   నీవు ఎచ్చటికి వెళ్ళుచున్నావు.
   మీరు ఎప్పుడు వచ్చారు.
3. ప్రథమ పురుష : ఇతరుల గురించి తెలుపునది.
   ఉదా: అతడు, వారు, వీడు
   వారు నిన్న బయలుదేరి వెళ్ళారు.
   అతడిని అందరూ అనుసరించారు.

**నేనివి నేర్చుకున్నా:**

- ఎదుటి వారి నుండి మనం నేర్చుకోవలసినవి ఎన్నో ఉంటాయి.
- వివిధ ప్రాంతాల మాండలికాలు, యాసలు తెలుగు భాషకు మణిపూసలు.

IISBG6

వి.సూ.: ● అమాయకులుగా ఉండరాదు. ● ప్రపంచ జ్ఞానాన్ని తెలుసుకోవలెను.